క్లుప్తంగా

ఉరుకుందలో వైభవంగా రుద్ర హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం వద్ద మంగళవారం రుద్ర హోమం వైభవంగా చేపట్టారు. అరుద్ర నక్షత్రంలో రుద్రహోమం నిర్వహించడం వల్ల శుభాలు జరుగుతాయని, అందుకే ఈ హోమ కార్యక్రమాన్ని ఉరుకుందలో కూడా ప్రారంభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. హోమంలో పాల్గొనే జంటలకు దేవాలయం వారు రూ.1500 టికెట్టు నిర్ణయించారు. చాల మంది భక్తులు తరలి వచ్చి స్వామి సన్నిధిలో పూజలు చేసి హోమం కార్యక్రమంలో పాల్గొని భక్తిని చాటుకున్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న టూ టౌన్ సీఐ సూర్యకుమార్

ఆదోని సెంట్రల్: విద్యార్థులు చెడు సాహవాసాలు, దురలవాట్లకు దూరంగా ఉండాలని టూ టౌన్ సీఐ సూర్యకుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వింధ్యశ్రీ పాఠశాలలో సైబర్‌క్రైమ్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సైబర్‌క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపడమే కాకుండా పిల్లల పట్ల తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. పిల్లలకు బైకులు ఇచ్చి రోడ్డు మీదకు పంపవద్దని సూచించారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు ముంచుకువస్తాయో తెలియదన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కే.జ్యోతి హెచ్‌ఎం పి.ఎస్. నాగేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కౌతాళం: ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో పోస్టర్లను విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యను పూర్తిగా కాషాయీకరణ చేసే యత్నం చేస్తోందన్నారు. జాతీయ నూతన విద్యా విధానం వల్ల ఇప్పటికే రాష్ట్రంలో చాల విద్యాసంస్థలు మూతబడ్డాయన్నారు. విద్యారంగ పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

230 మందికి ఎక్స్‌రే పరీక్షలు



టీబీ పరీక్షలు నిర్వహిస్తున్న మొబైల్ వాహనం

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో డాక్టర్ తాహెర్ ఆధ్వర్యంలో మంగళవారం టీబీ ఉచిత ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి టీబీ వ్యాధితో బాధపడుతున్న వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఎక్స్‌రే పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ మాట్లాడుతూ 230మందికి పైగా ఎక్స్‌రే పరీక్షలు చేశామన్నారు. వారిలో వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ సుశీల, సూపర్‌వైజర్లు కిశోర్‌కుమార్, లక్ష్మీనరసమ్మ, టీబీ సూపర్‌వైజర్ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో కొరవడిన నాణ్యత



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత కొరవడిందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బి.ఆఖండ, జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున అన్నారు. మంగళవారం పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యార్థులకు సన్న బియ్యం పంపిణీ చేస్తామని చెప్పిన కూటమి నేతలు పాఠశాలలకు నాణ్యతలేని బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రసూల్, మల్లి, ఉల్లేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

వరి రైతు వర్రీ

- ఊపందుకున్న వరి కోతలు
- తగ్గిన దిగుబడులు
- దక్కని గిట్టుబాటు ధర
- ఆదుకోని ప్రభుత్వం



పెద్దకొత్తిలిలో వరి పంటను కోస్తున్న మిషన్



పొలంలో రైతులు ఆరబోసుకున్న వరి ధాన్యం

నందవరం : ఆరు గాలం శ్రమించిన రైతన్న పరిస్థితులు అనుకూలించక ఆశించిన దిగుబడులు పొందలేకపోతున్నాడు. దీనికితోడు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించక పోవడంతో నష్టాలు మూటకట్టుకుంటున్నాడు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే మండలంలో అధికంగా వర్షాలు కురవడంతో రైతులు వరి అధికంగా సాగు చేశారు. అయితే ఆతరువాత అధిక వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం మండలంలో వరికోతలు ఊపందుకోగా.. దిగుబడి భారీగా తగ్గిపోయింది.

3,027 ఎకరాలలో సాగు

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి సాగుపై మొగ్గు చూపారు. దీంతో మండలంలో దాదాపు 3,027 ఎకరాలలో వరి సాగైందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎక్కువగా కర్నూలు సోనా, ఎన్‌డీఎల్, ఆర్ఎన్ఆర్ రకాలను సాగు చేశారు. అయితే అధిక వర్షాలతో పాటు తెగుళ్ల బెడదతో వరి పైర్లు దెబ్బతిన్నాయి. దీంతో ఎకరానికి 25 నుంచి 30 బస్తాలు మాత్రమే దిగుబడులు వస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. గతేడాదిలో 40 నుంచి 45 బస్తాల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం మండలంలోని నది తీర ప్రాంతాలైన నదికైరవాడి, నాగలదిన్నె, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, గురజాల గ్రామాలలో వరి కోతలు ప్రారంభమైయ్యాయి. కూలీల భారంతో రైతులు కోత మిషన్ల ద్వారా వరి కోతలను ప్రారంభించారు.

తగ్గిన ధర

వరికి మద్దతు ధర లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది వరి క్వింటా రూ.2,700 నుంచి రూ.3,300 వరకు విక్రయించి న్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో గిట్టుబాటు ధర లేక క్వింటా రూ.2,000 నుంచి రూ.2,200 మత్రమే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వరికి గిట్టుబాటు ధర కల్పించి రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

దిగుబడి తగ్గింది



నేను జొహరాపురం గ్రామంలో 6 ఎకరాల్లో వరి సాగు చేశా. ప్రస్తుతం ఆరు ఎకరాలకు గానూ 180 బస్తాలు పండింది. దిగుబడులు పూర్తిగా తగ్గాయి. గతంలో ఎరానికి 40 బస్తాలు పండించే వాళ్లాం. కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేదు. క్వింటా రూ.2,150 ప్రకారం విక్రయించా. ధర లేకపోవడంతో నష్టంవాటిల్లింది. ప్రభుత్వం వరి రైతులను ఆదుకోవాలి.

– విరుపాక్షిరెడ్డి , రైతు, జొహరాపురం

గిట్టుబాటు ధర కల్పించాలి



నాగలదిన్నె గ్రామంలో 18 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశా. ఎకరానికి కౌలు రూ.25 వేలు. ప్రస్తుతం ఎన్‌డీఎల్ సోనా, కర్నూలు సోనా రకాలను సాగు చేశా. కర్నూలు సోనా క్వింటా రూ.2,100, ఎన్‌డీఎల్ సోనా రూ.2,200 ప్రకారం బయట మార్కెట్ నడుస్తోంది. గత ప్రభుత్వంలో క్వింటా రూ.2,700 నుంచి రూ.3,000 వరకు అమ్ముకున్నాం. జగన్ ప్రభుత్వ హయంలో వరికి మంచి ధర లభించింది. ఎకరా వరి సాగుకు రూ.40 నుంచి రూ.45 వేల వరకు ఖర్చు అవుతుంది. ప్రస్తుత ధరలతో పూర్తిగా నష్టపోతున్నాం. ప్రభుత్వం వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

– రామాంజనేయులు, కౌలు రైతు, గురజాల

ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మార్చాలి

ఆదోని సెంట్రల్: పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహాన్ని తక్షణమే మార్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఎస్సీ సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మిని కలసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పైకప్పు పెచ్చులూడి కింద పడుతున్నాయని, ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు ముంచుకొస్తాయోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. భవనం పటిష్టత కోసం నూతన నిర్మాణాలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శశిధర్, నాగరాజు, రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

104 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

నందవరం : సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ 104 సిబ్బంది మంగళవారం ముగతి గ్రామంలో ఎంపీపీ లక్ష్మీదేవమ్మకు వినతి పత్రం అందజేశారు. అనంతరం 104 సిబ్బంది మాట్లాడుతూ.. అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన 3 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2020 విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈఓలకు జీఓ నంబర్–7 ద్వారా జీతాలు చెల్లించాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్‌ను తిరిగి చెల్లించాలని కోరారు.

మహిళా సాధికారతకు విద్య అవసరం



ఎమ్మిగనూరులో ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, పాఠకులు



నందవరంలో ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, పాఠకులు



ఆదోనిలో ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారిణి, సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని ఇందుకు బాలికలు క్రమశిక్షణతో చదువుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి హరికృష్ణ, ఎంఎస్ జెడ్పీ బాలికల హైస్కూల్‌ఉపాధ్యాయినులు శారదదేవి, వెంకటేశ్వరమ్మ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ లలిత తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలు

నందవరం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విద్యార్థినీ, విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా ఇందర గాంధీ చిత్రపటానికి శాఖ గ్రంథాలయ అధికారి వై శివరామప్రసాద్, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆదోనిఅర్బన్: గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారిణి సుజాత అన్నారు. మంగళవారం భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా న్విహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులచేత గ్రంథాలయ వారోత్సవాల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళలు, స్నైహా స్కూల్ విద్యార్థులు, పాఠకులు, సిబ్బంది దేవేంద్ర, రికార్డు అసిస్టెంట్ పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

ఆదోని టౌన్: భారతదేశ మాజీ మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని మంగళవారం ఆదోని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరానగర్ కౌన్సిలర్ గోవిందరాజులు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, స్థానికులు తాయప్పన్న, ప్రహ్లాద్, లక్ష్మణ్, పరమేశ, మల్లి తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయి, ఇందిరా గాంధీ జయంతి



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కౌతాళం : స్వాతంత్ర్య పోరాటంలో తెల్లదొరలను ఎదుర్కొని వీరవనితగా పేరుగాంచిన ఝాన్సీ లక్ష్మీబాయి, స్వాతంత్ర్య భారత మొదటి మహిళా ప్రధాని ఇందిరా గాంధీల జయంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలోని ప్రతిభ హైస్కూల్‌లో ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ దూద్‌బాషా ఉపాధ్యాయులతో కలసి వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, సిబ్బంది

కోసిగి: మండలంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించగా.. కడదొడ్డి గ్రామ సమీపంలోని వల్లూరు క్రాస్ రోడ్డు వద్ద ఆదోనికి చెందిన బోయ హనుమేష్, బోయ పద్మావతి వద్ద 90 ఒరిజనల్ చాయిస్ డీలక్స్ విస్కీ (90ఎంఎల్) టెట్రా ప్యాకెట్లును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాడుల్లో ఎమ్మిగనూరు ఎస్ఐ కార్తీక్ సాగర్, హెడ్ కానిస్టేబుల్ కె.నాగరాజు, డి.కిశోర్ కుమార్, కానిస్టేబుల్స్ మునీరంగడు, రవికుమార్, జనార్దన్ రావు పాల్గొన్నారు.

సారా తయారీకి బెల్లం విక్రయిస్తే చర్యలు

కోసిగి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కిరాణ, జనరల్ స్టోర్‌లలో నాటుసారా తయారీదారులకు, విక్రేతలకు బెల్లం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆశాఖ సీఐ భార్గవ్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం కోసిగి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కిరాణ షాపుల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా 5 కేజీల కన్నా ఎక్కువ బెల్లం కొనుగోలు చేస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధం

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన హేమంత్ రెడ్డి అనే వ్యక్తి పశువుల మేత కోసం పశుగ్రాసం కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో తరిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి పూర్తిగా కాలిపోయింది. మంగళవారం కౌతాళం మండలం వల్లూరు గ్రామం నుంచి పశుగ్రాసాన్ని ట్రాక్టర్‌పై తీసుకొస్తుండగా విద్యుత్ తీగలు తగిలి నిప్పులు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమై ట్రాక్టర్ డ్రైవర్ పశుగ్రాసాన్ని అక్కడే కిందకు పడేసి ట్రాక్టర్‌ను బయటకు తీసేశాడు. దీంతో ట్రాక్టర్ డైవర్ ప్రమాదం నుంచి బయట పడ్డాడు. పశుగ్రాసం మంటల్లో పూర్తిగా కాలిపోయింది. ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను పూర్తి ఆర్పేశారు. రూ.30వేలు పెట్టి కొనుగోలు చేసినట్లు రైతు వాపోయాడు.

మంత్రాలయంలో జబర్దస్త్ టీం సభ్యులు



వధూవరులతో జబర్దస్త్ టీం సభ్యులు

మంత్రాలయం: మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య కుమార్తె వైష్ణవి, ఆంజినేయ నూతన దంపతుల రిసెప్షన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జబర్దస్త్ టీం సభ్యులు గడ్డం నవీన్, చిట్టిబాబు మోహన్ తో పాటు మరి కొంత మంది హాజరై నూతన వధూవరులను ఆశీర్వాదించారు. అనంతరం గ్రామ దేవత మంచాలమ్మ., శ్రీ రాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

22న ఆర్చరీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఈనెల 22వ తేదీన జిల్లాస్థాయి స్త్రీ, పురుషుల టోర్నమెంట్ కమ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి కే.నాగరత్నమయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు వచ్చే నెల 2 నుంచి 4వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

ఆట్యా–పాట్యా ఎంపిక పోటీలు

ఈనెల 22వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఆట్యా–పాట్యా టోర్నమెంటు కమ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఆట్యా–పాట్యా సంఘం కార్యదర్శి బాల పవన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఆట్యా–పాట్యా పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వివరాలకు 93938 55460 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రీ సర్వే అర్జీలను డిసెంబర్ చివరిలోపు పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా
- డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

ఆదోని రూరల్: రీ సర్వే అర్జీలను డిసెంబర్ 31వ తేదీలోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదోని పట్టణంలోని విమల రీజెన్సీలో ఆదోని డివిజన్ రెవెన్యూ ఆఫీసర్స్, ఇతర శాఖలకు సంబంధించిన డివిజనల్ స్థాయి సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వేకి సంబంధించి గ్రామసభలు అన్నీ పూర్తి అయ్యాయన్నారు. ఆదోని డివిజన్‌లో 7,482 వరకు పిటీషన్‌లు వచ్చాయని, వీటిని ఎస్ఓపీ ప్రకారం డిసెంబర్ 31వ తేదీలోపు పరిష్కరించాలన్నారు. తహసీల్దార్లు, గ్రామాల వారీగా షెడ్యూల్ రూపొందించుకుని ఒక రోజు ముందు నోటీసులు ఇచ్చి గ్రామాలకు వెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ అంశాలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్‌లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. డివిజన్‌లో రీ ఓపెన్ కేసులు 9, సీఎంఓ గ్రీవెన్స్‌లు 4 పెండింగ్‌లో ఉన్నాయని, ఫీల్డ్‌కి వెళ్లి వెరిఫై చేసి వీటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

గొర్రెల యూనిట్లను ఏర్పాటు చేయాలి

నేషనల్ లైవ్లీ హుడ్ మిషన్ పథకం కింద మండలానికి రూ.10 లక్షల విలువ కలిగిన 2 గొర్రెల యూనిట్లను లబ్దిదారులతో ఏర్పాటు చేయించేవిధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. ఆదోని డివిజన్‌లో సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వడంలో కూడా 81.51శాతం మాత్రమే సాధించారని, 100 శాతం పురోగతి సాధించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెద్దకడబూరు, నందవరం, గొనెగండ్ల మండలాలు 70 శాతం పురోగతి సాధించారని, గొనెగండ్ల మండలం ప్రతి అంశంలోనూ వెనుకబడి ఉందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెద్దకడబూరు మండలం అతి తక్కువ పురోగతి సాధించినందున మండల వ్యవసాయశాఖ అధికారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని జిల్లా వ్యయసాయశాఖ అధికారిని ఆదేశించారు.

ఉపాధి హామీ పథకం నిర్వీర్యానికి కుట్ర



రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దకడబూరు: నిరుపేదలను ఆదుకునే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. కార్యక్రమంలో ముందుగా వ్యవసాయ కార్మికసంఘం జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జిల్లా పశ్చిమ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నా.. ప్రభుత్వాలకు ఏమాత్రం పట్టడంలేదని మండిపడ్డారు. ఇక్కడి ప్రజా ప్రతినిధులు కూడా పశ్చిమ ప్రాంత అభివృద్ధి గురించి ఎక్కడా మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సహాయ కార్యదర్శులు లింగన్న, బాలకృష్ణ, ఉపాధ్యక్షులు తిక్కన్న, రామాంజినేయులు, నాయకులు పాల్గొన్నారు.

కార్యాలయాల తరలింపును విరమించుకోవాలి

ఆదోని రూరల్: కర్నూలులో ఏర్పాటు చేసిన మానవహక్కుల కమిషన్, వక్ఫ్ ట్రిబ్యునల్, లోకాయుక్త కార్యాలయాల తరలింపు యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందర్‌సింగ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్యాలయాల తరలింపును నిరసిస్తూ ఆదోని బార్ అసోసియేషన్ 22వ తేదీ వరకు కోర్టు విధులను బహిష్కరిస్తూ తీర్మానం చేసిందన్నారు. దీనిపై నాయకులను కలిసి వినతి పత్రం సమర్పించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వైఆర్ మల్లికార్జున, సునీతారెడ్డి, విరూపాక్షిరెడ్డి, జి.సి.రంగన్న, ఖలందర్, లతీఫ్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు వసూలు చేయాలి

ఆలూరు: విద్యుత్ బకాయిలను వసూళ్లు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఏడీఈ సంతోష్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక ఏడీఈ కార్యాలయం ఆవరణంలో మంగళవారం ఆలూరు ఏఈ గుర్రప్ప ఆధ్వర్యంలో జెల్ఎం, ఎల్ఐ, పోల్‌టూ పోల్, బిల్ కలెక్టర్లు తదితరులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్‌డివిజన్ పరిధిలోని గృహాలు, బోరు బావుల విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి రెండునెలలుగా రూ. 1.66 కోట్ల విద్యుత్ బిల్లులు పెండింగ్ ఉందన్నారు. పరిమితికి మంచి విద్యుత్ వాడినన వారిపై విధించిన జరిమా రూ. 11 లక్షలు వసూళ్లు కావాల్సి ఉందన్నారు. మెండి బకాయిల వసూళ్లు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని హెచ్చరించారు.

ఉరుకుంద క్షేత్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ విజయరాజు

కౌతాళం: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ ఆలయంగా తీర్చిదిద్దుదాం అని ఆలయ ఈఓ, డిప్యూటీ కమిషనర్ విజయరాజు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈరన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆగమశాస్త్ర నిపుణుల సూచనలను పరిగణలోకి తీసుకుని ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని, దాని తగ్గట్టుగా పనులు చేపడుతామని చెప్పారు. శైవ, వైష్ణవ సంప్రదాయాలు కలిగిన ఆరుదైన దేవాలయాలలో ఉరుకుంద ఆలయం కూడా ఒకటి కావడం గమనార్హమన్నారు. రాజగోపురాలకు కలశాలు ప్రతిష్ఠించలేదని, ఆ కార్యక్రమాన్ని త్వరలోనే చేపడుతన్నట్లు తెలిపారు. స్వామి దర్శనానికి ముందే ప్రథమ పూజ్యుడు గణనాథుడిని దర్శించుకొనే ఆచారం ఉన్నందున ముఖద్వారం ప్రకారం వద్ద గణనాథుని విగ్రహ ప్రతిష్ఠాపనకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం, అభిషేక మండపం, స్వామి వారి ప్రసాదం తయారీకి పాకశాల, ఈశాన్యంలో యాగశాల, నవగ్రహ మండపం, దాతల భవనం, స్వామి వారి ఆశీస్సుల భవనం, ప్రకారం చుట్టూ మాఢవిధి, మండపం నిర్మాణం, బసవన్న దేవాలయ పునః నిర్మాణం, ఆంజనేయస్వామి దేవాలయ పునః నిర్మాణం, నిత్య అన్నదాన కాంప్లెక్స్ నిర్మాణం, పరిపాలన భవనం నిర్మాణం లాంటి అభివృద్ధి పనులు పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అలాగే ఆలయం సమీపంలో ఫ్లడ్‌లైట్‌ల ఏర్పాటు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, విద్యుదీకరణ పనులు కూడా తర్వాలోనే ప్రారంభిస్తామని చెప్పారు. దీనికి భక్తులు తమవంతుగా విరాళాలు అందించి దేవాలయ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

21న స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని అర్బన్: ఈనెల 21వ తేదీన పట్టణంలోని శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో అవోపా ఆదోని వారి ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాసనం మందు 5వ విడత పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వికాస తరంగిణి వారి సహకారంతో ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ సౌజన్యంతో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి వారి ఆదేశాల మేరకు స్వర్ణామృత ప్రసానం మందు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆరు నెలల నుంచి 16 సంవత్సరాల పిల్లలకు పుష్యమి నక్షత్రం రోజున గురువారం ఈ మందును పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ ఔషధం రోగనిరోధకశక్తి, మేధాశక్తి, ఆయుష్షు, చర్మ సౌందర్యాన్ని పెంచుతుందని, మానసిక శారీరక ఎదుగుదలకు దోహదం చేస్తుందన్నారు. ఈనెల 20వ తేదీలోపు 9849478178 కు ఫోన్ లేదా ఎస్ఎంఎస్ చేసి పిల్లల పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్టర్ చేసుకున్న వారికి మాత్రమే ఔషధాన్ని అందజేస్తామని చెప్పారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్: మండలంలోని సంతేకుడ్లూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. ఈమేరకు మంగళవారం ఆదోని డివిజన్ రివ్యూ మీటింగ్‌కు హాజరైన డీఈఓ శామ్యూల్ పాల్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పాఠశాల వేళల్లో మద్యం సేవించి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. గతంలో అనేక సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శశిధర్, నాగరాజు, గణేష్, రవితేజ, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.